స్కెచ్

# పరువు - మర్యాద

కాలజ్ఞానం సుబ్బారావు

పరువూ-మర్యాదా, నడిమంత్రపు తరగతివాళ్లకే ఏడుస్తూందని, అటు ధనికులకి, ఇటు పూటకు గతిలేని వాళ్ళకి దానితో నిమిత్తం లేదని ఆనాటికి రాఘవరావు గ్రహించాడు. పైగా ఆస్థిపరులకి "పరువూ—మర్యాదా" ఈ రెండుపదాలు నిఘంటువులో కూడ లేవని అవగాహన చేసుకున్నాడు. ఒకవేళబీదాసాదా ఒకప్పుడు లేకున్నా మరొకప్పుడు "పరువూ-మర్యాద"లకి ప్రాకులాడవచ్చుగాని పై తరగతి వాళ్ళకి అవి అన్యదేశ పదాలుగానే అగుపిస్తాయని రాఘవరావుకి తెలియ వచ్చింది. ఇలా మథనపడే బుర్రతో జిల్లాబోర్డు ప్రెసిడెంటు వారి ఇంటినుండి వెనక్కి వస్తున్నాడు.

రాఘవరావు ఆవూరి బోర్డుహైస్కూలులో టీచరు. కొద్దో గొప్పో పేరువచ్చింది విద్యార్థులకి బాగా శిక్షణ యిస్తాడని. వచ్చే జీతం తనకూ' యింట్లో వుండే అరడజను సభ్యులకు గంజికి మాత్రం చాలినా, కష్టంతో "పరువూ-మర్యాద" కాపాడుకుంటూ వచ్చాడు. డబ్బులు తీసుకుని విద్యార్థులను కృతార్థులుగా చెయ్యటం-ట్యూషన్ చెప్పే అబ్బాయిలపై ఒక కన్ను ఉంచడం-యిలాంటివి రాఘవరావుకు తెలీవు. సహోపాధ్యాయులలో కొందరు పైవానిలో ఆరితేరిన ఘటికులైనా అదేం పాపమోగాని రాఘవరావుకు జీవితానికంటేకూడా "పరువు-మర్యాద"ల మీద అభిమానం.'బ్రతుకలేనివాడు బడిపంతులౌతాడు' అని తాను నమ్మలేదు. కాని ఒకదానిలో మాత్రం నమ్మకం కుదిరింది. అయ్యవారి వృత్తి శ్రేష్ఠమయిందైనా, లాభదాయకమైన వ్యాపారం మటుకు కాదని! పంతులుగా తను విధిలేని పరిస్థితుల్లో తప్ప ఏ విద్యార్థినీ పల్లెత్తు మాట అనలేదు. తను అమ్మాయిలకి ఎక్కువ మార్కులు ఇస్తున్నానని అబ్బాయిలు గొణుగుతుంటే, వ్యంగ్యంగా తరగతిలో ఎవరికి ఎందుకు మంచిమార్కులొచ్చాయో విడమర్చి చెప్పేవాడు. అందుకనే విద్యార్థులకి రాఘవరావంటే ప్రాణం. జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారి అబ్బాయి, బళ్ళో నాయనగారి హోదావల్లనయితేనేం-మరేవిధంగా నయితేనేం 6వ ఫారందాకా జారకుండామెట్లెక్కి, అక్కడ కాస్త బండిఆపాడు-కాదు-బండి ఆగిపోయింది. బహుశా వాళ్ళ నాయన ఎన్నికల హడావుడిలో పుత్రరత్నం అంతు కనుక్కోక నిర్లక్ష్యం చేయడం తటస్థించి వుంటుంది. తత్ఫలితంగా కుమారుడు అక్టోబరులో కూర్చోవాలి. అందుకు మంచి ట్యూషను కావాలి.

రాఘవరావును గురించి పిల్లవాడు చెప్పటం వల్లా తను హెడ్మాష్టరుతో మాట్లాడుతో ఆయన్నిగూర్చి మంచిగా విని వుండటంవల్లా, రాఘవరావుకు కబురంపించారు. వెంటనే ఎగిరి వచ్చి శ్రీవారి సన్నిధి చేరుకున్నాడు రాఘవరావు. ప్రెసిడెంటువారు అబ్బాయిని అక్టోబరుకు తయారు చెయ్యాలంటే తిరుగుమాట లేకుండా తల వూపాడు. శ్రీవారు రాఘవరావుని ఫీజు ఎంత కావాలంటే, పాపం బాగా ముట్టుతుందనేమో లేక పెద్దవారితో బేరమెందుకనో, రాఘవరావు, "తమ యిష్టం" అన్నాడు. శ్రీవారు నవ్వి సరే నన్నారు. ఆనాడే మొదలు, ఉదయం సాయంత్రం రెండుపూటలా రోజూ చదువు చెప్పేవాడు శ్రీవారి కొడుక్కి. ఆ మట్టి బుర్రకి అందించేటప్పటికి రాఘవరావుకి తల ప్రాణం తోకకి వచ్చేది. అయినా రాఘవరావుకి లోపల మానవ సహజమైన ఓ ఆశ వుండేది: శ్రీవారి కొడుకు మంచి మార్కులతో పాసయితే తనను మంచి విలువైన కానుకతో బహూకరిస్తారని, కనీసం ప్రతిఫలం బాగా ముట్టుతుందని.

మొదటినెల గడచినా ఫీజు రాలేదు. బహుశా పరీక్షకు ముందుగా మొత్తం యిస్తారని (నూటపదహార్లు!) తృప్తిపడ్డాడు. తనకా మొత్తం సహాయకారి అని సంతోషించాడు. అనుకున్న ఐదుమాసాలు గడచి అబ్బాయి పరీక్షకి కూర్చో

జోతాడనగా రాఘవరావు ఫీజుకై ఎదురు చూచాడు. పాపం ముట్టలేదు. ముట్టే చిహ్నాలు అనుపించలేదు. అబ్బాయి పాసయితే ఒకేసారి పిలిచి సత్కరించి తను కలలుగనే ఆ కానుక ఓ వెస్టెండు బంగారు గొలుసు చేతిగడియారం, నూటపదహార్లతో పాటు యిస్తారని ఉవ్విళ్ళూర సాగాడు. ఫలితాలు తెలిసాయి. శ్రీ వారి అబ్బాయి పాసయ్యాడు రాఘవరావు కృషి ఫలితంగా. మట్టిబుర్రయినా సానబెట్టాడు. ఇక రాఘవరావుకి పండుగే ఆ రోజు. మరుచటి దినం శ్రీవారి పిలుపు తప్పదని, ఆ మహామహుల సాన్నిధ్యంలోకి ఖాదీ దుస్తులలో వెళ్ళటం ఉచితమని అనుకున్నాడు. ఘురుదినం పోయి దాని మరుదినా లెన్నో దొర్లుకుపోయినా రాఘవరావుకు పిలుపురాలేదు. తన కష్టానికిమాత్రం ఫలితం చిక్కలేదు. బహుశా శ్రీవారు యితరత్రా నిమగ్నులై యుంటారని తనే గనుక వెళ్ళి జ్ఞాపకం చేస్తే ఆపాళంగా సంతోషించి 'వరహాలవర్షం' కురిపిస్తారని, బాగా నాలుగుసార్లు యోచించి ఆదివారంగా చూచి బయలుదేరాడు. శ్రీవారు తన అదృష్టవశాత్తూ యింట్లోనే-తప్ప బంగాళాలోనే-ఉన్నారు. రాఘవరావు నౌకరుద్వారా కబురంపితే రమ్మన్నారు. పత్రిక తిరగవేసే శ్రీవారి సముఖంలో రాఘవరావు అటు తనుగా కూర్చోలేక పోయాడు. శ్రీవారు మాట్లాడితే గా! ఎలాగైతేనేం, చివరకి రాఘవరావుని కూర్చోమనకుండానే శ్రీవారు, "ఏమిటయ్యా విశేషం?" అని అడిగారు. జంకుతూనే "అబ్బాయి పాసయ్యాడు, అందుకనే వచ్చాను" అన్నాడు రాఘవరావు. "అలాగా, మంచిది" అన్నారు శ్రీవారు కడపటి పుట తిరగవేస్తూ. ఇంకా రాఘవరావు అక్కడే ఉండటం గ్రహించి, "ఇంకేమైనా విషయాలున్నాయా? బదిలీ గిదిలీ కావాలా?" అన్నారు. రాఘవరావు నిలువునా నీరయినా సమాళించుకొని, "మరి నా ఫీజు యిప్పిస్తారని ప్రార్థన," అని మెల్లగా అన్నాడు. శ్రీవారు నవ్వి,"ఆ మాట ఏమీ అనుకోలేదుగా! కావలిస్తే ఓ పదిరూపాయలు పట్టుకపొండి"అంటూ బంట్రోతును కేకేశారు. ఇంతలో శ్రీవారి ఆప్త మిత్రుడు మునిసిపల్ చెయిర్‌మన్ రావడంతో ఆ పది రూపాయలూ దక్కలేదు. "మళ్ళీరండి" అని రాఘవరావును పంపేశాడు. బంగళా బయటికి వచ్చిన రాఘవరావుని చూచి శ్రీవారి కుక్క మొఱిగింది, దానికీ రాఘవరావు విలువ తెలిసినట్లు. గేటు దాటాడనేకాని రాఘవరావు మతి చెదిరింది. తను కట్టుకున్న ఆశాసౌధాలు పేకమేడలై పడిపోయాయి ఆనాటి గాలికి.

"పది రూపాయలు"—ఈ మాటలు రాఘవరావు నోటినుండి అప్రయత్నంగా వెలువడ్డాయి. ఏడవలేక నవ్వుకున్నాడు. శ్రీవారి యీ ప్రవర్తన ఎవరితో చెప్పుకుంటాడు? దేవుడేమో అగుపడడాయె! లోకం! అమ్మో, ఏమనుకుంటుంది?

"అంత గొప్పవారు డబ్బుకి కక్కుర్తిపడతారా? ఈయనకే ఎక్కడిలేని ఆశ—ఎంత యిచ్చినా చాలదు"—అని! అదే ఓ నడిమంత్రపు తరగతి గుమాస్తా తన కొడుకు ట్యూషన్ ఫీజు ఆలస్యం చేశాడా,(తప్పక దేహం అమ్మి అయినా యిస్తాడు—పరువూ—మర్యాదా కావాలిగా మరి!)"గతి లేకుంటే ట్యూషన్ ఒకటి తక్కువ ఆ కుర్రాడికి"అంటుంది. లోకానికీ పరువూ—మర్యాదా అక్కరలేదు. ఆనాడు శ్రీవారు, "తమ యిష్టం' అంటే నవ్వినదానికి అర్థం యీనాడు స్ఫురించింది రాఘవరావుకి. ఓ వేళ తన పీడ వదలించుకునేందుకు తనను ఏమూలకో బదిలీచేయిస్తే? సైగా అడిగారుకూడాను: ఉద్దేశ్యం ఉందేమో? పిల్లాజెల్లా—ముసలీముతుకా-గర్భిణిభార్య, వీళ్ళతో తను ప్రయాణం కట్టడం సాధ్యమా? ఆర్థికంగా వీలుందా? ఈ సంశయాలతో రాఘవరావు అప్పట్లో కోరుకున్నది: "భగవంతుడా! (శ్రీవారి నుద్దేశించేమో!) యిక్కడినుండి బదిలీకాకుండా చూడు." ఇల్లు చేరుకున్నాడు. ఆనాడంతా పిచ్చి పట్టినట్లు ఉంది. బదిలీ భయం పీక్కొని చంప సాగింది. ఆ వాతావరణంలో ఆ రాత్రి రాఘవరావు కనురెప్ప వాల్చలేకపోయాడు.

పరువు మర్యాదలన్నవి నీ మెడలో వేసుకునే రుద్రాక్షమాలలు కావు: నీ హృదయంలో స్పందించే ఉత్కంఠలు.—మంజేరీ ఈశ్వరన్